క్లుప్తంగా

రామ మందిరం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కోడూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీరామమందిరం పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో రామ మందిరం జీర్ణావస్థకు చేరడంతో గ్రామస్తులు ఆలయాన్ని కూలదోశారు. దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు పూనుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా), ముద్దినేని చంద్రరరావు, గంగాప్రసాద్, ఇంకొల్లు సత్యన్నారాయణ పాల్గొన్నారు.

పెరుగుతున్న వరద ప్రవాహం



నాగాయలంక: కృష్ణానదికి ఎగువన ప్రకాశం బ్యారేజీ వద్ద రెండు రోజులుగా వరద నీటిని విడదల చేయడంతో నాగాయలంక శ్రీరామ పాద క్షేత్రం పుష్కరఘాట్‌లో కృష్ణానది వరద ప్రవాహం పెరిగింది. ప్రశాంతంగా, వడివడిగా బంగాళాఖతం వైపు దూసుకుపోతున్న వరద ప్రవాహం ఘాట్ లోని కృష్ణవేణి మాత విగ్రహం దాటుకుని ముందుకు సాగుతోంది. వరద ఉధృతిలో తీవ్ర ప్రభావం లేకపోయినప్పటికీ క్రమక్రమంగా వరద నీటి మట్టం పెరుగుతోంది. నదికి వరద నీటిని విడుదల చేస్తున్నందున మండలంలోని కృష్ణా పరీవాహక లంక ప్రాంతాల్లో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ హెచ్చరించారు.

90.13 శాతం పింఛన్ల పంపిణీ

మోపిదేవి: ప్రభుత్వం విడుదల చేసిన కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో స్వర్ణభారతి శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 6,131 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తుండగా కొత్తగా మండలానికి మరో 97 స్పౌజ్ పింఛన్లు విడుదలైనట్లు తెలిపారు. లబ్ధిదారులకు కొత్త పింఛన్లు కూడా అందించామన్నారు. సాయంత్రానికి తొలిరోజు 90.13 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వివరించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



కొత్తపల్లి(ఘంటసాల): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం నేతలు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేత వాకా రామచంద్రరావు మాట్లాడుతూ విద్యుత్తు చార్జీలు తగ్గిస్తామంటూ మోసపూరిత వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో భారీగా విద్యుత్తు చార్జీలు పెంచి ప్రజల పై పెనుభారం మోపిందన్నారు. ఈ నెల 5న ఘంటసాల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కామ్రేడ్ సుబ్బారావుకు నివాళి

చల్లపల్లి జమిందారీ విధానం రద్దు కోసం సీపీఐ (ఎం) దివి డివిజన్‌లో అభివృద్ధి కోసం మిలిటెంట్‌గా పోరాడి అమరుడైన కామ్రేడ్ తుమ్మల సుబ్బారావు సేవలను కొనియాడారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన కామ్రేడ్ సుబ్బారావు 15వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నేతలు మేడంకి వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు, తుమ్మల చంద్రమౌళి, కొడాలి మోహనరావు, కొడాలి పాండురంగారావు తదితరులు కామ్రేడ్ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు తెలియజేశారు.

మద్యం దుకాణం వద్ద బీరు బాటిళ్లతో ఘర్షణ

కోడూరు: మద్యం మత్తులో ఇద్దరు యువకులు మద్యం దుకాణం ముందే బీరు బాటిళ్లతో కొట్టుకున్న ఘటన కోడూరులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ప్రధాన సెంటర్‌లోని దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరం ఎదురుగా ఉన్న మద్యం దుకాణాల వద్ద కోడూరు తూర్పు వైపునకు చెందిన యువకులు మద్యం తాగారు. ఇద్దరు యువకుల మధ్య వివాదం తలెత్తడంతో బీరు దుకాణం వద్దే ఘర్షణకు దిగారు. యువకులు తమ చేతిలో ఉన్న బీరు బాటిళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయాన్ని గమనించిన మద్యం దుకాణదారులు ఇద్దరు యువకులను అక్కడ నుంచి పక్కకు పంపించగా, స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వైద్యులు అక్కడ నుంచి పంపేశారు. అయితే యువకులు బీరు సీసాలతో కొట్టుకున్న విషయం బయటకు పొక్కకుండా మద్యం దుకాణదారులు జాగ్రత్త పడ్డారు. మద్యం దుకాణాల వద్ద మందుబాబులు మద్యం తాగేందుకు ఏర్పాట్లు చేయడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. మద్యం దుకాణదారుల నుంచి ఎక్సైజ్ అధికారులు భారీగా ముడుపులు తీసుకొని పట్టించుకోకపోవడంతో మందుబాబులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

మురుగునీరు పోయే మార్గమేదీ?

- గత ఏడాది వలే ముంపునకు గురికావాల్సిందేనా?
- ఇప్పటికే నీరందక పంటలు ఎండిపోయిన వైనం
- ఎగువ నుంచి డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్క



వడ్లమన్నాడు డ్రెయినులో కూడూరు వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఎండిన జమ్ము

పెడన: డ్రెయిన్లలో మురుగునీరు పోయే మార్గం లేక రైతులు అవస్థలు పడుతున్నారు. సమస్యను ఎన్నిసార్లు విన్నవించినా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలోని చిన్న చిన్న డ్రెయిన్లు అన్నీ కూడా కొంకేపూడి, వడ్లమన్నాడు మెయిన్ డ్రెయిన్ల నుంచి మురుగునీరు లజ్జబండలో కలుస్తోంది. అటువంటి మెయిన్ డ్రెయిన్లు ఎగువ నుంచి వచ్చిన గుర్రపు డెక్క, జమ్ముపై రసాయనాలు పిచికారి చేసి వదిలేయడంతో అవి ఎండకు ఎండిపోయి అడ్డంకిగా మారాయి. మొన్నటి వరకు వరిసాగు చేస్తున్న రైతులకు నీరందని దుస్థితి నెలకొంది. వెదసాగు వేసిన పంటలు ఎండకు ఎండిపోయాయి. కొంత మంది రైతులు వర్షాలకు రెండో సారి కూడా వేసి ఎండబారిన పడ్డాయి. వర్షాలకు నీరు పుష్కలంగా వస్తుండటంతో ముచ్చటగా మూడో సారి వేసి పంటలను కాపాడుకున్నారు. కొందరు రైతులు వెద సాగులో ఆకు తగ్గిన చోట నారు తెచ్చి ఊడ్పులు ఊడ్చుకుని పంటను కాపాడుకుంటున్నారు. ఈ దశలో అధిక వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అందరి దృష్టి డ్రెయిన్లపై పడింది. నీరు అధికంగా ఉంటే తక్షణం పోయేలా చూసుకుంటున్నారు.

మెయిన్ డ్రెయిన్ల దుస్థితి అధ్వానం..

కొంకేపూడి డ్రెయిన్, వడ్లమన్నాడు డ్రెయిన్లు ఇటీవల బాగు చేయించారు. మురుగు నీటి ప్రవాహం కూడా బాగానే ఉంది. అయితే కొంకేపూడి డ్రెయిన్‌లో ఎగువ నుంచి వచ్చిన గుర్రపు డెక్క పెడన–గుడివాడ జాతీయ రహదారి వంతెన వద్ద బాగా పేరుకుపోయింది. దీంతో నీటి ప్రవాహం బాగా తగ్గింది. వడ్లమన్నాడు డ్రెయిన్ పరిస్థితిని పరిశీలిస్తే ఈ డ్రెయిన్‌లో రసాయనాలు పిచికారీ చేయడంతో జమ్ము, ఇతర గడ్డిజాతి మొక్కలు నీటిలోనే ఉండిపోయాయి. దీంతో మురుగునీరు ప్రవాహానికి అడ్డంకిగా మారాయి.

తొలగింపు పనులు చేపడతాం

సమస్యను రైతులు మా దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. పై నుంచి వచ్చిన గుర్రపు డెక్కను వర్షాలు తగ్గగానే తీయించేలా చర్యలు తీసుకుంటాం. అలాగే మిగిలిన ప్రాంతాల్లో కూడా మురుగునీరు బయటకు పోయేలా చూస్తాం. కొన్ని చోట్ల బాగు చేయించాల్సి ఉంది. వాటిని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

-వి.నాగేశ్వరరావు, ఏఈ, డ్రెయినేజీ, పెడన

మురుగునీరు పోయేలా చూడాలి



నందిగామ పరిసరాల్లోని చిన్న చిన్న డ్రెయిన్లను బాగుచేయించుకున్నాం. ఈ మురుగునీరు కొంకేపూడి డ్రెయిన్‌లోకి కలిసే చిన్న డ్రెయిన్ బొడ్డువాని పాలెం మీదుగా వెళ్తుంది. ఇది పూర్తిగా ఆక్రమణలకు గురై మురుగునీరు బయటకు పోయే పరిస్థితి లేదు.మెయిన్ డ్రెయిన్లలోకి వెళ్లాలి. మెయిన్ డ్రెయిన్లు ద్వారా నీరు బయటకు వెళ్లకపోతే ముంపు బారిన పడతాయి. తక్షణం కొంకేపూడి చిన్న డ్రయిన్,మెయిన్ డ్రెయిన్ పక్కన ఆక్రమణలు తొలగించి, బాగుచేయించి గుర్రపు డెక్క, జమ్ము, కిక్కిరిసి తొలగించి మురుగునీరు పోయేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

-బొడ్డు చినబాబు, రైతు

తొలగిస్తేనే ఫలితం ఉంటుంది



గుర్రపుడెక్క, జమ్ము, కిక్కిరిసి వంటి వాటిపై రసాయనాలు పిచికారీ చేయడం వల్ల ఫలితం అంతంత మాత్రమే. వాటిని పూర్తిగా తొలగిస్తేనే మురుగునీరు త్వరితగతిన బయటకు పోతుంది. లేకుంటే అడ్డంకిగా మారే పరిస్థితి. గత ఏడాది కూడా చేతికి వచ్చిన పంటలు ముంపుబారిన పడ్డాయి. ఇప్పుడు ప్రారంభంలోనే ముంపుబారిన పడతాయనే ఆందోళన ఉంది. తక్షణం డ్రెయిన్లు ద్వారా మురుగునీరు బయటకు పోయేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలి.

-జోగి సుబ్రహ్మణ్యం, రైతు

విజృంభిస్తున్న విషజ్వరాలు

పాపవినాశనం(ఘంటసాల): మండల పరిధిలోని పాపవినాశనం ఎస్సీ కాలనీలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. సుమారు 50 మందికి పైగా వివిధ రకాల జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరాలు వచ్చిన వారంతా పాపవినాశనం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లోని గ్రామీణ వైద్యుల వద్ద వైద్యం చేయించుకోవడంతో పాటు శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. అయినా జ్వరాలు తగ్గక పోవడంతో చల్లపల్లి, ఇతర ప్రాంతాల ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లగా అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ, విష జ్వరాలుగా నిర్ధారించారు. దీంతో కొంతమంది ఆసుపత్రుల్లో ఉండి చికిత్స పొందుతుండగా, మరికొందరు మందులు వాడుకుంటున్నారు. ఎస్సీ కాలనీలో ఎక్కువ మందికి జ్వరాలు రావడానికి గల కారణాలు ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నేడు భూముల రీ-సర్వేపై గ్రామసభ

నాగాయలంక: మండలంలోని టి.కొత్తపాలెంలో శనివారం భూముల రీ సర్వేపై గ్రామసభ నిర్వహిస్తున్నామని మండల తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ గ్రామం పరిధిలోని వ్యవసాయ భూముల రీ సర్వే పూర్తి కావడంపై తాజా సర్వే ఆధారంగా డ్రాఫ్ట్ (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) జిల్లా కలెక్టర్ ఆమోదించారని పేర్కొన్నారు. ఈమేరకు కలెక్టర్ ఆదేశానుసారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు సభ జరుగుతుందని భూ యజమానులు తప్పనిసరిగా హాజరై తమ భూముల వివరాలను తాజా సర్వే ఆర్ఓఆర్‌లో పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి వరలక్ష్మీ వ్రతం



భావదేవరపల్లిలో అన్నపూర్ణాదేవి



కొక్కిలిగడ్డలో సామూహిక కుంకుమార్చన, వరలక్ష్మీవ్రతం



మచిలీపట్నంలో గాంధీ బొమ్మ శివాలయంలో సామూహిక కుంకుమ పూజలు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామంలో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం భ్రమరాంబ అమ్మవారికి వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. క్రోవ్వి పార్థసారధి బ్రహ్మత్వంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా విశేష పూజలు నిర్వహించారు. 11 గంటలకు సువాసినీలచే సామూహిక కుంకుమార్చన అనంతరం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వరలక్ష్మీవ్రతంలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రావణమాసం ప్రతి రోజూ అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు ఉంటాయని వివరించారు.

ప్రత్యలంకారంలో..

నాగాయలంక: శ్రావణ మాసం ద్వితీయ శుక్రవారం పర్వదినం పురస్కరించుకుని భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ధర్మకర్త పూషడపు నిరంజనరావు నేతృత్వంలో ఆకెళ్ళ దేవనాథన్‌శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారిని కుంకుమతో అలంకరించి విశేష పూజ జరిపారు. నాగాయలంక కృష్ణానది తీరంలోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో అర్చకుడు ముదునూరు శ్రీనివాసశాస్త్రి అధ్వర్యంలో అమ్మవారికి శ్రావణ మాస ప్రత్యేక పూజ నిర్వహించారు. మండలంలోని గణపేశ్వరంలో దర్గమ్మను అర్చకుడు పోతుకూచి సత్యనారాయణశర్మ శోభాయమానంగా అలంకరించారు. టి.కొత్తపాలెం గ్రామంలోని శ్రీ భ్రమరాంబదేవి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు అంబా సాయికిరణశర్మ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం అమ్మవారికి అభిషేక మహోత్సవం, విశేష అలంకరణ నేత్రపర్వంగా జరిపారు.

లక్ష గాజుల అలంకారం

మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ఉన్న మహిషాసురమర్దిని సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం (గాంధీ బొమ్మ శివాలయం)లో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారికి లక్ష గాజుల అలంకరణ, సుహాసినిలచే సామూహిక వరలక్ష్మీవ్రతములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోలాటం, లలితా సహస్ర నామ పారాయణ నిర్వహించారు. పాల్గొన్న సుహాసినిలకు పసుపు, కుంకుమ, వెండి లక్ష్మీ దేవి రూపులను ఆలయ నిర్వాహకులు ఉచితంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చేబ్రోలు సాయి రామ్ కుమార్, కందుకూరి చిట్టిబాబు, గట్టుపల్లి సాయిచరణ్, చేబ్రోలు రాజసులోచనల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సామూహిక వరలక్ష్మి వ్రతాలు జొన్నలగడ్డ వాసు, జొన్నలగడ్డ సాయి బ్రహ్మత్వంలో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తమ్మన రాధాకృష్ణ మూర్తి, యెండూరి సురేష్, చేబ్రోలు బాబీ, గాయత్రి, నంబుల నాగ ప్రసాద్ (వాసు), నంబూరి శ్రీనివాస్, దేసు సూర్య ప్రకాశరావు, కొల్లిపర బాలాజీ దుర్గ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నగదు వసూళ్లు

- నకిలీ నియామక పత్రాలతో బురిడీ
- ఎంపీ కార్యాలయంలో అటెండర్ నిర్వాకం

సాక్షి నెట్‌వర్క్: తాను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కార్యాలయంలో ఉంటానని, తాను ఎంత చెబితే అంత.. ఎంతో మందికి ఉద్యోగాలు ఇప్పించానని నమ్మబలికిన కార్యాలయ అటెండర్ గోపాలసింగ్ మోసపూరిత మాటలతో ఎంతో మంది మోసపోయారు. మచిలీపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్యకళాశాల, యూనివర్సిటీ తదితర శాఖల్లో ఉద్యోగాలు ఉన్నాయని, అధికారులతో మాట్లాడి ఇప్పిస్తానని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల చొప్పున దాదాపు 30 మంది నుంచి వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, తదితర మండలాలకు చెందిన నిరుద్యోగులు గోపాల్‌సింగ్ వలలో పడి డబ్బులు కూడా చెల్లించుకున్నారు. ఎంపీకి చెప్పి తాను ఉద్యోగాలు ఇప్పిస్తానని కొద్దిరోజులు ఓపిక పట్టాలని వారికి నమ్మబలికి అనంతరం నియామకపత్రాలు కూడా నిరుద్యోగులకు అందజేసినట్లు చెబుతున్నారు. అయితే సంబంధిత అభ్యర్థులు ఆయా కార్యాలయాలకు వెళ్లి నియామకపత్రాలు అధికారులకు చూపగా ఈ పత్రాలన్నీ నకిలీవని అక్కడి అధికారులు చెప్పారు. దీంతో బాధితులు గోపాల్‌సింగ్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో లేకపోవటంతో మచిలీపట్నం నగరంలోని నాయర్‌బడ్డీ సెంటరులో ఎంపీ కార్యాలయానికి వచ్చి అక్కడున్న కార్యాలయ ప్రతినిధులకు తాము మోసపోయిన వైనాన్ని వివరించారు. దీంతో కార్యాలయంలో ఉన్న ప్రతినిధులు రెండు రోజులు ఓపిక పట్టండి తాము గోపాల్‌సింగ్‌ను తీసుకువచ్చి విచారణ జరుపుతామని చెప్పటంతో బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే గోపాల్‌సింగ్ ఎంపీ కార్యాలయంలో అటెండరుగా పనిచేస్తూ ఎంతో మందిని పలు విధాలుగా మోసం చేశాడని, ఉద్యోగాలే కాకుండా తిరుపతి లెటర్లు ఇస్తానని, దర్శనం కల్పిస్తానని మోసం చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే గోపాల్‌సింగ్ వ్యవహారంలో కార్యాలయంలో ఉన్న కొందరికి జోక్యం ఉందా, లేదా తాను ఒక్కడే చేశాడా అనేది పోలీసులు విచారణ జరిపి నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని బాధితులు కోరుతున్నారు.

ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా సౌకర్యాలు

డిపో మేనేజర్ హనుమంతరావు



బస్సు డ్రైవర్లు, కండెక్టర్లకు సూచనలిస్తున్న డీఎం హనుమంతరావు తదితరులు

చల్లపల్లి: మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ అవనిగడ్డ డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన చల్లపల్లి బస్టాండును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బస్టాండుల్లో రద్దీ పెరగనున్న దృష్ట్యా అందుకు అనుగుణంగా సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అవనిగడ్డ డిపో పరిధిలోని అన్ని బస్టాండుల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, కుర్చీలు ఏర్పాటు, ఫ్యాన్లు, టాయిలెట్లు వంటివి ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను మెరుగుపరుస్తున్నట్లు వివరించారు. బస్సు డ్రైవర్లు, కండెక్టర్లు ప్రయాణికులతో గౌరవ మర్యాదలతో మెలగాలని సూచించారు. డీఎం హనుమంతురావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ పి.శ్రీధర్ ఉన్నారు.

'ఉపాధి' నిబంధనల్లో సమూల మార్పులు



ఎఫ్‌ఏల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏపీడీ రామ్మోహన్

పెడన: ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న పనుల్లో మరింత పారదర్శకత ఉండేలా ప్రభుత్వం మరిన్ని కఠినతరమైన నిబంధనలు ప్రవేశపెడుతుందని అధికారులు అన్నారు. శుక్రవారం పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన క్షేత్రసహాయకులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. రాబోవు కొద్ది రోజులలో ఈ పథకం ద్వారా చేపట్టే పనుల్లో నిభందనల్లో సమూల మార్పులు రాబోతున్నాయన్నారు. పనులను గుర్తించే భువన యాప్‌లో జరిగిన మార్పులతో పాటు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో హాజరు పంపే విధానంలో వచ్చిన మార్పులను, ఎఫ్‌ఏలకు వివరించారు. భువన్‌లో వర్కుల గుర్తింపు ఏవిధంగా చేయాలో ఫీల్డ్ విజిట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ రామకృష్ణ, ప్రసాద్, ఏపీడీలు రామ్మోహన్, నాగసురేష్, ఏపీవోలు వజీర్, సైదారావు, టీఏలు, సీవోలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల విద్య మెరుగుపడాలి



రికార్డులను పరిశీలిస్తున్న కుముదిని సింగ్

పెడన: దివ్యాంగ విద్యార్థుల విద్య మరింత మెరుగుపడాలని, వారికి శిక్షణ విషయంలో మెలకువలను నేర్పించాల్సి ఉంటుందని సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్. కుముదిని సింగ్ అన్నారు. శుక్రవారం ఆమె పట్టణంలోని 12వ వార్డులో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక (బంగ్లా) స్కూల్‌లోని దివ్యాంగుల భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు. సిబ్బంది నుంచి పలు విషయాలను అడిగి తెలుసుకోవడంతో పాటు విద్యార్థుల విద్యా సామార్థ్యాన్ని పరిశీలించారు. సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు అమలు అవుతున్న పథకాలు, లబ్ధి పొందుతున్న అలవెన్సుల చెల్లింపుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సహిత విద్య ఇంచార్జి సమన్వయకర్త కె.ఏడుకొండలు, పెడన ఎంఈవో- 2 వైవీ హరనాథ్, ఐఈఆర్పీ హమీద్, సీఆర్‌ఎంటీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

గూడూరు: స్థానిక భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్.కుముదిని సింగ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఐఈ కోఆర్డినేటర్ కె.ఏడుకొండలుతో కలసి భవిత కేంద్రానికి వచ్చిన కుముదిని సింగ్ కేంద్రంలో రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు కేంద్రం ద్వారా అమలు అవుతున్న పథకాలు, లబ్ధిపొందుతున్న అలవెన్సుల గురించి ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. సీడబ్ల్యూఎస్‌ఎస్ పిల్లలు తయారు చేసిన చాక్‌పీస్‌లను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.భారతి, ఐఈఆర్పీ పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు బలమైన ఆహారం



పల్లెపాలెంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న డాలీ సుకన్య



బంటుమిల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ సముద్రవేణి

బంటుమిల్లి: అప్పుడే పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలు బలవర్ధకమైన ఆహారమని ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ ఎం.సముద్రవేణి అన్నారు. స్థానిక ఎస్సీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పురుడు పోసుకున్న తల్లి నుంచి ముర్రుపాలు అప్పుడే పుట్టిన బిడ్డకు పట్టడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బాలింతలు పాలు పట్టే విషయంతో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ వారోత్సవాలు ఈ నెల 8వ తేదీ వరకు గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వార ఏర్పాటు చేయనున్న అవగాహన సమావేశాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, శ్రావణకుమారి, బంటుమిల్లి గ్రామ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: బిడ్డకు తల్లిపాలను మించిన ఆరోగ్యకరమైన ఆహారం మరొకటి లేదని అధికారులు అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెదపల్లెపాలెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్, ఆరోగ్యశాఖాధికారులు తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలలో రోగనిరోధకశక్తి ఉందన్నారు. ప్రతి తల్లీ తన బిడ్డకు తల్లిపాలను అందించాలన్నారు. అనంతరం అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైహెచ్‌ఈవో ప్రభావతి, ఎంపీహెచ్‌ఈవో కుమారి, ఎంపీఏస్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కమల, సరోజని, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయాలి

గూడూరు: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టడం ద్వారా చేకూరే ప్రయోజనాలు తల్లులకు తెలియజేయాలని ఆకులమన్నాడు సీహెచ్‌ఓ డాలి సుకన్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆకులమన్నాడు వెల్‌నెస్ సెంటర్ పరిధిలోని ఆకులమన్నాడు, కప్పలదొడ్డిపాలెం ఆశా కార్యకర్తలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సరళ, ఆశా వర్కర్లు ఇందిర, రజని, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించాలి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కటకం ప్రసాద్ తదితరులు

పెడన: డ్వాక్రా మహిళల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం ద్వారా ఆర్థికంగా పరిపుష్టి చెందాలని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా విభాగం ద్వారా మెప్మా స్వయం సహాయ సంఘాలతో అర్బన్ మహిళా మార్కెట్ (మెప్మా బజార్)ను ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు, మార్కెటింగ్ ప్రోత్సాహాలు, ఆన్లైన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్‌ను కటకం ప్రసాద్ ప్రారంభించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో సుమారుగా 30 స్వయం సహాయక సంఘ సభ్యులు ఉత్పత్తులను తయారు చేయడం అభినందనీయమన్నారు. వాటిని స్టాల్స్‌లో ప్రదర్శించడం, అమ్మకాలు చేయడం సంతోషకర విషయమన్నారు. ప్రతినెలా మెప్మా బజార్ ద్వారా నైపుణ్యాలతో కూడిన జీవనోపాదులను పెంపొందించాలని మెప్మా సిబ్బందికి సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, సిటీ మిషన్ మేనేజర్ ఆనందబాబు, సీఓలు, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఆర్పీలు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లకు జరిమానా

కోడూరు: అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లకు రెవెన్యూ అధికారులు జరిమానా విధించారు. మండలంలోని వేటపాలెం గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్న సమాచారంలో శుక్రవారం రాత్రి దాడులు చేసినట్లు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి తెలిపారు. ఈ దాడుల్లో నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పారు. ఒకొక్క ట్రాక్టర్‌కు రూ.2 వేల చొప్పున నాలుగు ట్రాక్టర్లకు రూ.8 వేలు జరిమానా విధించినట్లు వివరించారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాక్టర్ల యజమానులను హెచ్చరించారు. మండలంలో మట్టి తవ్వకాలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

తాడేపల్లి(ఘంటసాల): ప్రజలందరికి సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు- కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజా) అన్నారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.